క్లుప్తంగా

4 నుంచి కొత్తపల్లెలో దేవర

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఈ నెల 4వ తేదీ నుంచి శ్రీరాములమ్మ, శ్రీవాసుదేవమ్మ దేవతల దేవర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 4వ తేదీ గురువారం పోతుల ఊరేగింపు, విగ్రహాల ఊరేగింపు, చెక్క భజన, 5వ తేదీ శుక్రవారం బాణం కుండల ఊరేగింపు, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులవ్వాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గడివేముల: మండల పరిధిలోని రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రారంభించేందుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సోమవారం తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరగనున్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా మండలంలోని నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు, అవ్వాతాతలకు పెంచిన పింఛన్ డబ్బులను అందించేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు చింతమానుపల్లెలో వైద్య శిబిరం

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, గ్రామస్తులు కార్యక్రమానికి హాజరై ఉచిత వైద్య సేవలను పొందాలని కోరారు. మండల, గ్రామ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఇంటికీ అయోధ్య రాముని అక్షింతలు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ప్రతి ఇంటికీ అయోధ్య రాముని అక్షింతలను వితరణ చేస్తామని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డిసాయిరెడ్డి, రాష్ట్ర బజరంగ్‌దళ్ కన్వీనర్ టి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టులోని శివ సాయి దత్త జ్ఞానమందిరంలో సరస్వతీ దేవాలయం, ఆరోర నగర్‌లోని రాజరాజేశ్వరి దేవాలయం, బుధవారపేటలోని శ్రీలక్ష్మీగణేష్ నగర్ ఆలయాల పరిధిలోని ఇళ్లకు తిరిగి ఆయోధ్య రాముని అక్షింతలను వారు వితరణ చేశారు. ముందుగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలను వితరణచేశారు. ఆయా కార్యక్రమాల్లో కర్నూలు నగర కార్యదర్శి ఈపూరి నాగరాజు, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడుతాం

కర్నూలు(సెంట్రల్): పేదల పక్షాన పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం అన్నారు. సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా సోమవారం బీఆర్ అంబేడ్కర్ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరించి అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 99 సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ పేదల కోసం పోరాడి ఎంతో మంది ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇప్పించిందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రావణి, శ్రీనివాసులు, సులోచనమ్మ, కళావతమ్మ, సత్యం బీమిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్) : రెండు రోజుల్లో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ హెచ్చరించారు. తమ సమస్య ల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, చంద్రశేఖర్, ఉప కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన ఎండీ అంజిబాబు, నాయకులు సుధాకరప్ప పాల్గొన్నారు.

కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులు చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరుకుంది. సోమవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శిల్పా ఎస్టేట్ సమీపంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కిషోర్‌కు గాయాలయ్యాయి. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా కిషోర్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో బైకు అదుపుతప్పి సిమెంట్ రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ కిషోర్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు సోమవారం బంధువులు తెలిపారు.

పింఛనుదారులకు నూతన కానుక



- కొత్త సంవత్సరంలో పింఛన్ రూ.3 వేలకు పెంపు
- నేటి నుంచి లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ
- నియోజకవర్గంలో 537 మందికి కొత్తగా మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నియోజకవర్గంలో పింఛనుదారుల వివరాలు

మండలం	కొత్తగా పింఛన్లు	పాత పింఛన్లు	మొత్తం
పాణ్యం	96	6490	6586
గడివేముల	212	5822	6034
ఓర్వకల్లు	79	7585	7664
కల్లూరు	150	8371	8521
మొత్తం	537	28,268	28,805

పాణ్యం: కొత్త సంవత్సరం వేళ పింఛనుదారులకు ప్రభుత్వం కానుక అందించింది. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ సొమ్మును విడతల వారీగా పెంచుతూ వచ్చిన ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా రూ.3 వేలకు పెంచి లబ్ధిదారులకు అందించనుంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ సొమ్ము పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అలాగే కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు నిండాయి. నేటి నుంచి వలంటీర్లు పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి రూ.3 వేలు నగదు పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం అందిస్తున్న పింఛన్లతో పాటు పాణ్యం నియోజకవర్గంలో అదనంగా 537 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. నేటి నుంచి 8 రోజుల పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను పండుగలా నిర్వహించనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకున్న సీఎంను ఇంతవరకు చూడలేదు. మొదటిసారిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. కొత్త సంవత్సరం నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి ఇస్తుండడం సంతోషంగా ఉంది. పింఛన్ పెంపుతో నాలాంటి లబ్ధిదారులకు ఇతరలపై ఆధారపడకుండా ఎంతో మేలు కలుగుతుంది. ప్రజల కష్టాలు తెలిసిన నేత సీఎం వైఎస్ జగన్.

– దూదేకుల దస్తగిరి, పింఛన్‌దారుడు, గడివేముల

జగనన్న మేలు మరువలేం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంఛన్ సొమ్ము రూ.3వేలకు పెంచడం సంతోషంగా ఉంది. మా అవసరాలు గుర్తించి అడగకుండానే వివిధ పథకాల ద్వారా నెరవేరుస్తున్నారు. చెప్పిన మాట ప్రకారం ఇప్పుడు పింఛన్ సొమ్ము పెంచారు. ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము ఇంటి వద్దకే పంపుతున్నారు. గతంలో పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల వద్ద గంటలు, రోజుల తరబడి వేచిచూసిన ఘటనలు ఉన్నాయి. వైఎస్ జగనన్న చేసిన మేలు ఎన్నటికీ మరువలేం.

–పొలుగారి ఓబులమ్మ, అహల్యాపురం, పాణ్యం మండలం

సమాజంలో అనాథలను ఆదరించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి. చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఉన్న అనాథలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న హోమ్ ఆఫ్ హోప్ అనాథాశ్రమంలో అనాథలు, చిన్నారులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నూతన ఏడాదిని పురస్కరించుకుని అనాథల సమక్షంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యూరాలజిస్టు డాక్టర్ హేమంత్‌కుమార్, హార్ట్ ఫౌండేషన్ ట్రెజరర్ వెంకటరాముడు, సభ్యులు లక్ష్మన్న, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాణ్యంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ


సి.బెళగల్ ఏబీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న సంఘ పెద్దలు


రెవెన్యూ అధికారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య


గూడూరులో సచివాలయం పట్టణ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు


ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్

అంబరాన్నంటిన 'నూతన' సంబరాలు

- ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్న యువత
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఎమ్మెల్యే కాటసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న గడివేముల పొదుపు మహిళలు, ఎమ్మెల్యే సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గంలో 2024 నూతన సంవత్సర వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12గంటల తర్వాత యువకులు ఉత్సాహంతో కేరింతలు కొడుతూ నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బేకరీలు, బట్టల దుకాణాలు, హోటళ్లు కిటకిటలాడాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ వర్గాల వారు పోటీ పడ్డారు. వైఎస్సార్ సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు భారీగా తరలివచ్చారు. సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లామ్, కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, క్రిష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.ఆదిమూలపు సతీష్, స్టేట్ కమిటీ సభ్యులు సంధ్యా విక్రమ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు భారీగా తరలివచ్చి కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

కల్లూరు : నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా, సంతోషంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యేతో పాటు ఆయన తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి స్వగృహంలో అందరి సమక్షంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని అధికారులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతనోత్సాహంతో పని చేద్దాం

కర్నూలు సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరం నూతనోత్సాహంతో పనిచేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని ఆయన స్వగృహంలో 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నియోజవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. గతంలో ఏ నాయకుడు కూడా ఇలా చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైన గెలవాలని ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయన్నారు.అయితే, ప్రజలు వైఎస్ జగన్ వైపే ఉన్నారని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థుల సంబరాలు

సి.బెళగల్: మండల కేంద్రంలోని బీసీ, గురుకులం, మోడల్ బాలికలు, కస్తూర్బా బాలికల వసతి గృహాల విద్యార్థులు ఆదివారం రాత్రి వారి హాస్టళ్లలో న్యూ ఇయర్ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ స్థానిక బీసీ వసతి గృహ విద్యార్థులు హ్యాపీ న్యూ ఇయర్ ఆకారంలో ప్రభుత్వం పంపిణీ చేసిన దుప్పట్లు కప్పుకుని శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఉదయం హాస్టళ్ల విద్యార్థులు కేకలను కట్ చేసి ఆనందాలను మిత్రులతో జరుపుకున్నారు.

జేసీ, రెవెన్యూ అధికారులను కలిసిన వీఆర్వోలు

నూతన సంవత్సర సందర్భంగా మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కలిసి ఆమెతో కేక్ కట్ చేయించి కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీఆర్వోలు డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) కృష్ణమూర్తి, ఆధ్వర్యంలో కర్నూలులోని తహసీల్దార్ శేషఫణి గృహంకు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్‌ను, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మధుసుధన్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల గణాంకాధికారి (ఏఎస్ఓ) ఆదినారాయణ, వీఆర్వోలు ఉన్నారు.

గూడూరులో ఘనంగా వేడుకలు

గూడూరు: పట్టణంలో సోమవారం నూతన సంవత్సర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, సచివాలయ కన్వీనర్ ఎల్. వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కేవీ గజేంద్రగోపాల్, డి.సుందరరాజుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. ప్రభుత్వ అధికారులు తమ ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు కర్నూలు వెళ్లారు.

గడివేముల: మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కర్నూలులోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయి అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల స్థాయి అధికారులు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేకులు కట్ చేసి ఘనంగా నిర్వహించారు.

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

పాణ్యం : నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని జెడ్పీటీసీ సద్దల సరళమ్మ ఆకాంక్షించారు. సోమవారం కొండజుటూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డిలను గ్రామస్తులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేయించారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎంపీడీఓ దస్తగిరి, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ సుమంత్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు జాకీర్‌హుసేన్, సిబ్బంది నరసింహారెడ్డి, వెంకటరమణ, బషీర్ తదితరులు పాల్గొన్నారు. పాణ్యం సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఐలు ఆశోక్, వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నూతనోత్సాహంతో విధులు నిర్వహిద్దాం

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలోని ఉద్యోగులు, సిబ్బంది 2024లో నూతన ఉత్సాహంతో విధులు సమర్థవంతంగా నిర్వహిద్దామని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ఉర్దూ యూనివర్సిటీలోని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ రిజిస్ట్రార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అందరి సహకారంతో ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జెఎండీ షఫీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి కొండపై పోటెత్తిన భక్తులు

క్రిష్ణదొడ్డికి పోటెత్తిన్న భక్తులు

సి.బెళగల్: కొత్త సంవత్సర వేడుకలలో భాగంగా సోమవారం మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామం కొండపై వెలసిన శ్రీ కోన వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. విద్యార్థులు ఆలయం పరిసరాలలో కొండపై కేక్‌లను కట్‌చేసి నూతన సంవత్స వేడుకలను జరుపుకున్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

మండలంలోని వివిధ గ్రామాలలోని క్రైస్తవ ఆలయాలలో పాస్టర్లు, సంఘ పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆది, సోమవారాలలో స్థానిక అమెరికన్ బాప్టిజమ్ మెమోరియల్ (ఏబీఎం) చర్చిలో సంఘకాపరి (పాస్టర్) సోలోమోన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సర పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు. సంఘ పెద్దలతో కలిసి కేక్ కట్‌చేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలును తెలుపుకున్నారు. వివిధ గ్రామాలలోని చర్చీలు భక్తులతో నిండిపోయాయి.


సి.బెళగల్లో నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు


కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జాతీయ స్థాయి పోటీలకు 'సాయి' క్రీడాకారులు


జాతీయ పోటీలకు ఎంపికయిన సాయి సెంటర్ హాస్టల్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : ఈనెల 5 నుంచి 9 వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న అండర్-19 జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ హ్యాండ్ బాల్ పోటీలకు కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఇండియా హాస్టల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికయిన క్రీడాకారులు అభి, భువనేష్, జనార్దన్, సాగర్‌లను సెంటర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, హ్యాండ్ బాల్ శిక్షకులు ప్రభాకర్ అభినందించారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.


ఓంకారేశ్వరుడు

ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం ఆలయంలో వెలిసిన శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వార్లకు సోమవారం ఉదయం విశేషంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామతాభిషేకం, సుగంధ ద్రవ్య అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని హైవే-44పై మదార్‌పురం వద్ద రోడ్డు దాటుతున్న బైకిస్టును కారు ఢీకొట్టింది. మల్కాపురం ఆర్‌ఎంపీ కున్నూరు మాధవకృష్ణ బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటే ప్రయత్నం చేయగా కర్నూలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కారుపై పడ్డ ఆర్‌ఎంపీ తీవ్ర గాయాలపాలయ్యాడు. హైవే పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని తమ వాహనంలో వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించారు.

యువకుడిపై దాడి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి మహబూబ్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనివాస సర్కిల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్‌ను అటుగా వెళ్లిన వారు గమనించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తల, శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు సోమవారం సాయంత్రం తెలిపారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు


మల్లన్న దర్శనార్థం వస్తున్న ఎస్సీ నేషనల్ కమిషన్ మెంబర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి షెడ్యూల్డ్ క్యాస్ట్ నేషనల్ కమిషన్ మెంబర్ సుభాష్ రామ్‌నాథ్ పార్థి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ప్రధానాలయ రాజగోపురం వద్ద చేరుకున్న ఆయనకు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు



కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు తమ మొక్కును తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. బళ్లారికి చెందిన శకుంతలబాచి, ఈరోజీరావు అండ్ సన్స్ రూ.1,00,116, పుష్పలత, అశోక్ కుమార్ అండ్ సన్స్ రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలు, బాండు, ఫొటో అందజేశారు.